సాక్షి తిరుపతి

బుధవారం : 14 : మే : 2025



లైసెన్స్ పట్టు..ఉద్యోగం కొట్టు

హెవీ లైసెన్సు ఉంటే ఉద్యోగం చేతిలో ఉన్నట్లేనని అలిపిరి ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్ ప్రిన్సిపల్ హరిబాబు పేర్కొన్నారు. - 8లో



కనులపండువగా శ్రీవారి చక్రస్నానం

పెంచలకోన బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన మంగళవారం స్వామి చక్రస్నానం కనులపండువగా సాగింది. - 8లో



సముద్ర తీరంలో అలజడి

వాతావరణ మార్పుల కారణంగా వాకాడు మండలం తుపిలిపాళెం సముద్ర తీరంలో మంగళవారం అలజడి నెలకొంది. - 8లో


అలంకరణలో అమ్మవారు


గంగమ్మ జాతరకు ఆలయం వద్ద పోటెత్తిన భక్తులు




సోమవారం అర్ధరాత్రి తరువాత గంగమ్మకు అభిషేకం చేస్తున్న అర్చకులు



తాతయ్యగుంట గంగమ్మ జాతర వారంరోజుల పాటు కన్నులపండువగా సాగింది. ప్రతిరోజు విభిన్న వేషధారణలతో భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. మంగళవారం పొంగళ్లు పెట్టేందుకు భక్తులు తరలిరావడంతో ఆ ప్రాంతం జనసంద్రంగా మారింది.

భక్తులతో హోరెత్తిన ఆలయం

- భక్తి శ్రద్ధలతో పొంగళ్ల నివేదన
- జాతర చివరి రోజున పోటెత్తిన భక్తులు
- గంగజాతర వేషాలతో పులకించిన తిరునగరి

గంగరంగ సంబరం


సప్పరాలతో నృత్యం చేస్తూ గంగమ్మ ఆలయానికి వచ్చి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు



తిరుపతి కల్చరల్ : శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతర తిరుపతిలో అంగరంగ వైభవంగా జరిగింది. ఈనెల 6వ తేదీ రాత్రి చాటింపుతో మొదలైన జాతర వారం రోజుల పాటు అత్యంత కోలాహలంగా సాగింది. రోజువారీ విభిన్న వేషాలతో భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. మంగళవారం జాతర చివరి రోజు కావడంతో ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులతో గంగమ్మ ఆలయం భక్తులతో కిక్కిరిసింది. సోమవారం అర్ధరాత్రి అమ్మవారికి మహాశాంతి అభిషేకం తర్వాత అమ్మవారి దర్శనం కోసం భక్తులు వేలాదిగా తరలివచ్చారు. మొక్కుబడిలో భాగంగా వేపాకు చీరలతో గంగమ్మను దర్శించుకుని భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. జాతర చివరిరోజు కావడంతో ఉదయం నుంచి రాత్రి వరకు విశేష సంఖ్యలో భక్తులు వివిధ పౌరాణిక, జానపద, స్త్రీ వేషాలు ధరించి తిరు నగరిలోని పురవీధుల్లో సందడి చేశారు. భక్తజనంతో గంగమ్మ ఆలయ పరిసర ప్రాంతాలు సందడి నెలకొంది. ఆలయ అధికారులు, పోలీసులు భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.

గంగమ్మ విశ్వరూప దర్శనంతో పులకించనున్న భక్తజనం

శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతర మహోత్సవంలో చివరిరోజు బుధవారం తెల్లవారుజామున విశ్వరూపంతో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఇందులో భాగంగా ఆలయ ఆవరణలోని అమ్మవారి విశ్వరూప కొడిస్తంభం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బంకమట్టితో సర్వాంగ సుందరంగా అమ్మవారి విశ్వరూప ప్రతిమ కొలువు తీరనుంది. అమ్మవారి విశ్వరూప ప్రతిమ చంపను పేరంటాల వేషధారుడు బుధవారం తెల్లవారుజామున నరకడంతో జాతర సమాప్తం అవుతుంది.




తిరుపతి ప్రియదర్శిని కూరగాయల మార్కెట్‌లో పొంగళ్లు పెడుతున్న భక్తులు


వివిధ వేషధారణలతో భక్తుల మొక్కులు


పొర్లుదండాలతో భక్తుల మొక్కులు


సారె తెస్తున్న భక్తులు

న్యూస్‌రీల్

627 మంది గైర్హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా మంగళవారం ఉదయం ప్రథమ సంవత్సరం, మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లిష్ పరీక్ష నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 64 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన ప్రథమ సంవత్సర పరీక్షకు జనరల్, ఒకేషనల్‌లో కలిపి 13,560 మందికి 565 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మొత్తం 12,995 మంది పరీక్ష రాశారు. అలాగే ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 24 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు జనరల్, ఒకేషనల్‌లో కలిపి 615 మందికి 62 మంది గైర్హాజరు కాగా 553 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. బుధవారం ఉదయం, మధ్యాహ్నం ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు మ్యాథ్స్-1ఎ, 2ఎ, బోటనీ, సివిక్స్ సబ్జెక్టుల పరీక్షలు ఉంటాయని ఆర్‌ఐఓ జీవీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపిక

తిరుపతి ఎడ్యుకేషన్ : ఇటీవల వెలువడిన పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన తిరుపతి జిల్లాకు చెందిన ఇద్దరు విద్యార్థులు షైనింగ్ స్టార్-2025 అవార్డుకు ఎంపికైనట్లు డీఈఓ కేవీఎన్ కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా వెంకటగిరిలోని ఏపీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల విద్యార్థిని కళాపాటి ఇంద్రజ 600 మార్కులకు 594మార్కులు, అలాగే నారాయణవనం మండలం పాలమంగళం జెడ్పీ హైస్కూల్ విద్యార్థి మేరువ ఆశిష్ విభిన్న ప్రతిభావంతుల కేటగిరీలో 500 మార్కులకు 481 మార్కులు సాధించి ప్రతిభ చాటారు. వీరు జిల్లా నుంచి షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికయ్యారని డీఈఓ తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 4 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 10 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 68,760 మంది స్వామివారిని దర్శించుకోగా 27,544 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.90 కోట్లు సమర్పించారు. దర్శన టికెట్లు లేని భక్తులకు 4 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

జాతరలో నిర్లక్ష్యం!

- భారీగా భక్తులు వస్తారని తెలిసినా శ్రద్ధపెట్టని అధికారులు
- వీఐపీలు, సామాన్య భక్తులకు ఒకే క్యూలైన్
- తిరుపతి తాతయ్య గుంట గంగమ్మ జాతరలో తోపులాట
- భయపడి అమ్మవారిని దర్శనం చేసుకోక వెనుదిరిగిన భక్తులు
- ముందస్తు జాగ్రత్తలు తీసుకోని అధికారులు






క్యూలైన్‌లో భక్తుల తోపులాటతో చిన్నారుల ఇక్కట్లు


గంగమ్మ ఆలయం వద్ద వీఐపీ క్యూలైన్‌లో తోసుకుంటున్న భక్తులు, నిలువరిస్తున్న పోలీసులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: తిరుపతి తాతయ్య గుంట గంగమ్మ జాతరలోనూ తోపులాట తప్పలేదు. నిర్వహణ లోపంతో వేల మంది భక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చిన్నారులతో వచ్చిన భక్తులు తోపులాటను చూసి అమ్మవారిని దర్శనం చేసుకోకనే వెనుదిరిగారు. తిరుపతిలో ఏటా మే నెల మొదటి వారంలో నిర్వహించే తాతయ్య గుంట గంగమ్మ జాతర రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎంతో విశిష్టమైనది. గంగమ్మ జాతరను దృష్టిలో ఉంచుకుని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్ర పండుగగా ప్రకటించి వైభవంగా నిర్వహించింది. తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలను తలపించేలా వారం రోజుల పాటు జాతరను జరిపించారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక మొదటి సారి నిర్వహించిన గంగమ్మ జాతరను తూతూ మంత్రంగా నిర్వహించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గంగమ్మ జాతరలో అతి ముఖ్యమైన రోజైన మంగళవారం అధికార యంత్రాంగం చాలా జాగ్రత్తలు తీసుకుంటుంది. అయితే కూటమి ప్రభుత్వం గంగమ్మ జాతర నిర్వహణపై నిర్లక్ష్యంగా వ్యవహరించిందని భక్తులు మండిపడుతున్నారు. అమ్మవారి దర్శనం కోసం మంగళవారం భక్తులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా తోపులాట చోటు చేసుకుంది. తిరుమల వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల పంపిణీలో చోటు చేసుకున్న తొక్కిసలాట ఘటన గుర్తుకొచ్చి భక్తులు అనేక మంది అమ్మవారి దర్శనం చేసుకోకనే వెనుదిరిగి వెళ్లిపోవటం కనిపించింది. ఆలయం వద్ద వీఐపీలు, సామాన్య భక్తులు రెండు క్యూలైన్లు ఏర్పాటు చేశారు. అయితే అందరూ ఒకే క్యూలైన్లోకి ప్రవేశించడంతో భక్తుల మధ్య తోపులాట చోటు చేసుకుంది. ఎండ వేడిమికి ఊపిరి ఆడక చిన్నారులు, మహిళలు ఉక్కిరిబిక్కిరయ్యారు. మంగళవారం రాత్రి కూడా వీఐపీలు, సామాన్య భక్తులు ఒకే క్యూలైన్ ద్వారా లోనికి అనుమతించటంతో భక్తుల మధ్య మరోసారి తోపులాట చోటు చేసుకుంది. పలు ప్రాంతాల నుంచి మహిళలు పొంగళ్లు పెట్టేందుకు తరలిరాగా స్థలం లేక అనేక మంది మహిళలు వెనుదిరిగి వెళ్లిపోవటం కనిపించింది. మొత్తంగా తాతయ్య గుంట గంగమ్మ జాతర నిర్వహణపై భక్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.


సొమ్మసిల్లగా సపర్యలు చేస్తున్న కుటుంబ సభ్యులు


మా వాళ్లని ఎందుకు పంపరంటూ పోలీసులతో జనసేన నాయకురాలి వాగ్వాదం


గేటు తీసి పంపరా అంటూ ఆలయ ఉద్యోగులతో జనసేన చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేవర మనోహర్ వాగ్వాదం


క్యూలైన్‌లో భక్తుల తోపులాట

చెరువులనూ వదల్లేదుగా..

- ప్రకృతిని చెరబడుతున్న కూటమి నేతలు
- ఇటీవలి వరకు ప్రభుత్వ భూముల్లో గ్రావెల్ తరలింపు..
- ఇప్పుడు చెరువులను తోడేస్తున్న వైనం
- మామూళ్ల మత్తులో అధికారులు


నెలబల్లి పెద్ద చెరువులో రాత్రివేళ జేసీబీతో ట్రాక్టర్లలోకి గ్రావెల్ లోడ్ చేస్తున్న దృశ్యం

దొరవారిసత్రం : మండల పరిధిలో నిన్న మొన్నటి వరకు ప్రభుత్వ భూముల్లో విలువైన గ్రావెల్‌ను అక్రమంగా తరలించి కూటమి నాయకులు రూ.లక్షలు వెనుకేసుకున్నారు. అంతటితో ఆగని వారి ధనదాహం ఇప్పుడు గ్రామాల్లోని చెరువుల వైపు మళ్లింది. రాత్రికి రాత్రే టిప్పర్లు, లారీల్లో విలువైన గ్రావెల్‌ను తరలించి రూ.లక్షలు దోచుకుంటున్నారు. ఇదంతా కళ్లెదుటే జరుగుతున్నా.. అడ్డుకోవాల్సిన రెవెన్యూ, ఇరిగేషన్, పోలీసులు శాఖలు చోద్యం చూస్తుండడంతో గ్రామీణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఎక్కడెక్కడంటే..

నెలబల్లి, నెల్లూరుపల్లి, కల్లూరు తదితర గ్రామాల్లోని ఇరిగేషన్ పరిధిలో ఉన్న చెరువుల్లో ఇష్టారీతిన అక్రమంగా గ్రావెల్ తరలించడంతో భారీగా గోతులు ఏర్పడ్డాయి. గత మూడు రోజుల నుంచి నెలబల్లి గ్రామ పరిధిలోని సుమారు 350 ఎరాలకు సాగునీరు అందించే నెలబల్లి పెద్దచెరువులో రాత్రి సమయంలో గుట్టు చప్పుడు కాకుండా స్థానికంగా ఉన్న కొందరు కూటమి నేతలు యంత్రాలతో తోడి ట్రాక్టర్లతో విలువైన గ్రావెల్‌ను బయట ప్రాంతాలకు తరలించి భారీ మొత్తంలో సొమ్ము చేసుకుంటున్నారు. స్థానికంగా ఎవరైనా అడ్డుకుంటే ఇళ్లకు గ్రావెల్ తరలిస్తున్నామని బుకాయిస్తున్నారు. మరో వైపు నియోజకవర్గానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధి పేరు చెప్పుకుంటూ కూటమి నేతలు అవినీతికి పాల్పడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయితే కళ్లెదుటే గ్రావెల్ తరలిస్తున్నా..అడ్డుకోవాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారనే విమర్శలు పెద్దఎత్తున వినిపిస్తున్నాయి.

తిరుపతి బస్టాండ్ నుంచే ప్రక్షాళన

- అధికారులతో డీపీటీఓ వెంకట్రావ్ తొలి సమావేశం


సమావేశంలో సూచనలు ఇస్తున్న డీపీటీఓ వెంకట్రావ్

తిరుపతి అర్బన్: తిరుపతి బస్టాండ్ నుంచే ప్రక్షాళనకు శ్రీకారం చుట్టాలని జిల్లా ప్రజా రవాణా అధికారి (డీపీటీఓ) వెంకట్రావ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన తిరుపతి బస్టాండ్‌ను పరిశీలించారు. అనంతరం ఏటీఎం చాంబర్‌లో అధికారులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ శ్రీహరి బస్టాండ్‌లో కొంతభాగాన్ని త్వరలో తొలగించనున్న నేపథ్యంలో ఆర్టీసీ కార్గో కార్యాలయాన్ని ఏ ప్రాంతానికి మార్పు చేస్తే బాగుంటుంది ? అలాగే ఈ ప్లాట్ ఫాంల్లో ఆగుతున్న బస్సులను ఎక్కడ కేటాయిస్తే ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందనే అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం ఈ నెల చివరికల్లా తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఏ ప్లాట్‌ఫాంలో బస్సు ఆగుతుందో అక్కడి నుంచే ఆటోమేటిక్ అనౌన్స్‌మెంట్ ఇచ్చేలా తక్షణం చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. తిరుపతి బస్టాండ్ పరిశుభ్రత విషయంలో జిల్లాలోని అన్ని బస్టాండ్లకు ఆదర్శంగా ఉండాలని సూచించారు. ప్రతి దుకాణదారుడు డస్ట్‌బిన్ ఏర్పాటు చేసుకోవడంతో పాటు ఎమ్మార్పీ ధరలకే వస్తువులు విక్రయించాలన్నారు. ఆర్టీసీలోని ప్రతి ఉద్యోగి నిబద్ధతతో పని చేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. రాష్ట్రంలో తిరుపతి జిల్లాలోనే అత్యధికంగా 11 ఆర్టీసీ డిపోలు ఉన్నాయని, మన జిల్లాను రాష్ట్రానికే మార్గదర్శకంగా తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డెప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ విశ్వనాథం, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ డీఆర్ నాయుడు, ఆర్టీసీ ఇంజినీరింగ్ అధికారులు చెన్నకేశవులు,లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

లైసెన్స్ పట్టు..ఉద్యోగం కొట్టు

- హెవీ లైసెన్స్‌కు పుష్కలంగా ఉద్యోగ అవకాశాలు
- 32వ బ్యాచ్‌కు డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ పూర్తి
- శిక్షణ ధ్రువపత్రాలు జారీ చేసిన డీఎం

తిరుపతి అర్బన్ : జేబులో హెవీ లైసెన్స్ ఉంటే...చేతిలో డ్రైవర్ ఉద్యోగం ఉన్నట్లుగా భావించాలని అలిపిరి డీఎం, అలిపిరి ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్ ప్రిన్సిపల్ సింగం హరిబాబు పేర్కొన్నారు. అలిపిరి డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న 32వ బ్యాచ్‌కు మంగళవారం డీఎం చేతుల మీదుగా హైవీ డ్రైవింగ్ లైసెన్స్ కోసం శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ధ్రువపత్రాలను జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధ్రువపత్రాలను తిరుపతి ఆర్టీవో కార్యాలయంలో సమర్పిస్తే వెంటనే హెవీ డ్రైవింగ్ లైసెన్స్ సర్టిఫికెట్స్ అందిస్తారని స్పష్టం చేశారు.

జిల్లాలో ఏకైక డ్రైవింగ్ స్కూల్

2022 ఫిబ్రవరిలో తిరుపతిలోని అలిపిరి ఆర్టీసీ బస్టాండ్‌లో జిల్లాలోనే ఏకైక డ్రైవింగ్ స్కూల్ ఏర్పాటు చేశారని ప్రిన్సిపల్ వెల్లడించారు. ఒక్కో బ్యాచ్‌లో 16 మంది చొప్పున ఇప్పటి వరకు 32 బ్యాచ్‌ల్లో 512 మందికి శిక్షణ ఇవ్వడంతో పాటు సర్టిఫికెట్స్ ఇప్పించామని వెల్లడించారు. ఇందులో 50 శాతం మందికి స్థానికంగా విద్యుత్ బస్సులు, ఆర్టీసీ గ్యారేజ్‌లో, కాల్ డ్రైవర్స్‌గాను, స్కూల్ బస్సు డ్రైవర్లుగాను ఉద్యోగ అవకాశాలు లభించాయని పేర్కొన్నారు. సాధారణంగా హెవీ డ్రైవింగ్ లైసెన్స్ పొందడానికి శిక్షణ తీసుకోవడానికి పెద్ద మొత్తంలో ఖర్చు చేయాల్సి ఉందని చెప్పారు.

నేటి నుంచి శిక్షణ ప్రారంభం

33వ బ్యాచ్‌కి బుధవారం నుంచి శిక్షణ ప్రారంభిస్తామని ప్రిన్సిపల్ చెప్పారు. 34వ బ్యాచ్‌కు ఈనెల 15 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అలిపిరి డిపో అసిస్టెంట్ మేనేజర్ పుష్పలత, డ్రైవింగ్ స్కూల్ నిర్వాహకుడు రాము పాల్గొన్నారు.



శిక్షణ ధ్రువీకరణ పత్రాలను అలిపిరి డీఎం హరిబాబు, ఏడీఎం పుష్పలత నుంచి అందుకుంటున్న డ్రైవర్లు

వైఎస్సార్‌సీపీ సర్కార్ పునాదే... ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 2022 మార్చిలో ఒక్కో జిల్లాకు ఒక్కో హెవీ డ్రైవింగ్ లైసెన్స్ శిక్షణ స్కూల్స్‌ను నామమాత్రపు ఫీజుతో ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో ఎంతో మంది హెవీ డ్రైవింగ్ లైసెన్స్‌ను సులభంగా పొందుతున్నారు. ఉద్యోగాలు చేస్తున్నారు. వారంతో గత సర్కార్ చేసిన మేలును గుర్తుచేసుకుంటున్నారు.

24 ఏళ్లు మిలటరీలో పనిచేశా



మిలటరీలో 24 ఏళ్లు పని చేశా. గతేడాది రిటైర్డ్ కావడంతో తిరుపతికి వచ్చా. అయితే అలిపిరి ఆర్టీసీ డిపోలో హెవీ లైసెన్స్ కోసం డ్రైవింగ్ స్కూల్ నడుస్తున్న సంగతి తెలిసిందే. హెవీ లైసెన్స్ ఉంటే చేతిలో ఉద్యోగం ఉన్నట్లు భావించి 32వ బ్యాచ్‌లో నామమాత్రపు ఖర్చులతో శిక్షణ పూర్తి చేసుకున్నా. – ధనంజయులు, మాజీ సైనికుడు, తిరుపతి నగరం

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా గిరిధర్‌రెడ్డి



సూళ్లూరుపేట : నాయుడుపేటకు చెందిన ఓడూరు గిరిధర్‌రెడ్డిని పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ మంగళవారం కేంద్ర పార్టీ కార్యాలయం ఉత్తర్వులు విడుదల చేసింది. ఆవిర్భావం నుంచి పార్టీలోనే ఉంటూ ఆయన పలు పదవుల్లో కొనసాగారు. శ్రీ కాళహస్తి నియోజకవర్గంలో తన సేవలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరినీ కలుపుకుని పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

చెరువులో అంత్యక్రియలు చేయొద్దని నిరసన



వివాదాన్ని సర్దుబాటు చేస్తున్న తహసీల్దార్ విజయలక్ష్మి

బాలాయపల్లి (సైదాపురం) : మండలంలోని నిండలి గ్రామానికి చెందిన వల్లెపు కోటమ్మ (110) మంగళవారం మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని సమీపంలోనే కొత్త చెరువు వద్ద అంత్యక్రియలు నిర్వహించేందుకు ప్రయత్నించగా స్థానిక దళితవాడ ప్రజలు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. తమ ఇళ్ల ముందే దహన సంస్కారాలు ఎలా చేస్తారంటూ దళితులు ఆందోళన వ్యక్తం చేశారు. పూర్వీకుల నుంచి ఇక్కడే ఖననం చేస్తున్నామని మరో వర్గం వాదనలకు దిగారు. ఈ వివాదం తీవ్రస్థాయికి చేరుకోవడంతో తహసీల్దార్ విజయలక్ష్మి, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఇరువర్గాల వాదనలు విన్నారు. చెరువు ప్రభుత్వ స్థలం ఇక్కడ అంత్యక్రియలు నిర్వహిస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించడంతో మృతదేహాన్ని శ్మశాన వాటికకు తరలించారు. దీంతో వివాదం సమసిపోయింది.

గంగమ్మకు మాజీ మంత్రుల సారె

తిరుపతి కల్చరల్ : శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతర వేడుకల్లో భాగంగా మంగళవారం మాజీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్‌కే రోజా ఆలయ ప్రదర్శన చేసి అమ్మవారికి సారెను సమర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి పెద్దిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. అమ్మవారికి ఆనవాయితీగా సారె సమర్పించి దర్శించుకున్నట్లు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రోజా మాట్లాడుతూ.. తాను పుట్టి పెరిగిన ఊరు, చిన్నప్పటి నుంచి ఇప్పటి వరకు ఇక్కడ అమ్మవారి గుడికి వస్తుంటానని పేర్కొన్నారు. అమ్మవారిని దర్శించుకున్న మాజీ మంత్రులకు ఆలయ పండితులు అమ్మవారి ఆశీర్వచనం, తీర్థప్రసాదాలు అందజేశారు.



అమ్మవారికి సారె సమర్పిస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి



అమ్మవారికి సారె తీసుకొస్తున్న మాజీ మంత్రి రోజా

సముద్ర తీరంలో అలజడి

వాకాడు : వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పుల కారణంగా మంగళవారం వాకాడు మండలం తూపిలిపాళెం సముద్రతీరంలో అలజడి అధికమైంది. భగభగ మండుతున్న ఎండలు, ఒక్కోసారి అకస్మాత్తుగా కారు మబ్బులు, ఉరుములు, మెరుపులు, పిడుగులతో కూడిన భారీ వర్షం కారణంగా మధ్య సముద్రం అల్లకల్లోలంగా మారుతోంది. దీంతో ఏ సమయంలో ఏమి జరుగుతుందోనని తీరప్రాంత ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఎన్నడూ లేని విధంగా రాత్రిపూట సముద్రంలో భీకరమైన శబ్దాలు చేయడంతో ఏదో పెద్ద ప్రమాదమే పొంచి ఉందని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఒక్కసారిగా సముద్ర కెరటాలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. రెండు రోజులుగా అలల ఉధృతి మారుతుండడంతో అలలు దాదాపు 5 మీటర్ల ఎత్తుకు ఎగసిపడుతున్నాయి. తూపిలిపాళెం, కొండూరుపాళెం, అంజలాపురం, శ్రీనివాసపురం, ఓడపాళెం, మొనపాళెం, వైట్‌కుప్పం, పూడికుప్పం, నవాబుపేట, పూడిరాయిదొరువు సముద్రం వద్ద మత్స్యకారులు తమ బోట్లను ఒడ్డున గట్టి భద్రత ఏర్పాట్లు చేసుకున్నారు.

రిటైర్డ్ ఉద్యోగి ఇంట్లో చోరీ

తిరుపతి క్రైమ్: నగరంలోని రిటైర్డ్ ఉద్యోగి ఇంట్లో చోరీ జరిగిన సంఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఎస్వీ యూనివర్సిటీ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీకృష్ణ నగర్ ఎనిమిదో వీధిలో రిటైర్డు కోర్టు సూపరింటెండ్ దొరస్వామి నివాసం ఉంటున్నాడు. వేసవి సెలవులు కావడంతో సోమవారం కుటుంబ సభ్యులతో కలిసి చిత్తూరుకు వెళ్లాడు. అయితే వారింట్లో పని చేసే రామ్మూర్తి మంగళవారం ఉదయం తలుపులు పగలగొట్టి ఉండడం గమనించి యాజమానికి సమాచారం ఇచ్చాడు. దీంతో పోలీసులు వచ్చి పరిశీలించగా ఇంట్లో ఉన్న రూ.20 వేల నగదు, 40 గ్రాముల బంగారు ఆభరణాలు దోచుకెళ్లినట్లుగా గుర్తించారు. గుర్తు తెలియని వ్యక్తులు నగలు, నగదు చోరీ చేసినట్లుగా పోలీసులు గుర్తించారు. దొరస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి



తడ : మండలంలోని తడకండ్రిగ పంచాయతీ బీఎల్‌పాడు గ్రామ సమీపంలో సుమారు 35 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి మంగళవారం కదులుతున్న రైలు నుంచి జారిపడి మృతి చెందాడు. సూళ్లూరుపేట జీఆర్‌పీ ఎస్‌ఐ చెన్నకేశవ తెలిపిన సమాచారం మేరకు ..ఓ వ్యక్తి మృతదేహం పట్టాల మధ్య ఉన్నట్లు తడ రైల్వేస్టేషన్ మాస్టర్ ఇచ్చిన సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. రైలులో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు జారిపడి మరణించి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాలుగేళ్ల చిన్నారిపై అసభ్య ప్రవర్తన

– వృద్ధుడికి గ్రామస్తుల దేహశుద్ధి

గూడూరు రూరల్ : ఆడుకుంటున్న ఓ చిన్నారికి చాక్లెట్ ఆశ చూపి పక్కనే ఉన్న గదిలోకి తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించేందుకు యత్నించిన ఓ వృద్ధుడికి స్థానికులు దేహశుద్ధి చేసిన సంఘటన మంగళవారం గూడూరు మండలం చెన్నూరులో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు గ్రామ సమీపంలో ఆడుకుంటున్న ఓ చిన్నారికి అదే ప్రాంతానికి చెందిన 50 ఏళ్ల వృద్ధుడు సిరాజ్‌ఖాన్ (మస్తాన్) మద్యం మత్తులో చాక్లెట్ ఇస్తానని మాయ మాటలు చెప్పి పక్కనే ఉన్న గదిలోకి తీసుకెళ్లాడు. చిన్నారితో అసభ్య ప్రవర్తనకు పాల్పడుతున్న సమయంలో గమనించిన స్థానికులు గట్టిగా కేకలు వేశారు. వృద్ధుడు అక్కడి నుంచి పరారయ్యేందుకు ప్రయత్నించడంతో స్థానికులు అతన్ని పట్టుకుని దేహశుద్ధి చేశారు. ఈ విషయమై స్థానిక పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదని తెలిపారు.

ఆటోను ఢీకొన్న టిప్పర్

- ఇద్దరికి తీవ్ర గాయాలు, 9 మందికి స్వల్పగాయాలు

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని పదవమైలు గ్రామం వద్ద కేటీ రోడ్డుపై సోమవారం అర్ధరాత్రి ఆటోను టిప్పర్ ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలు, 9 మందికి స్వల్పగాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నా యి. సోమవారం తమిళనాడు రాష్ట్రం పెరంబదూర్‌కు చెందిన 11 మంది శ్రీకాళహస్తికి దైవ దర్శనానికి బస్సులో బయలుదేరి వరదయ్యపాళెంకు వచ్చారు. అక్కడి నుంచి ఆటోలో శ్రీకాళహస్తికి బయలుదేరారు. పదోమైలు గ్రామం వద్ద కేటీరోడ్డుపై ఆటోను ఎదురుగా వస్తున్న టిప్పర్ ఢీకొంది. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా 9 మందికి స్వల్పగాయాలయ్యాయి. వీరిని శ్రీకాళహస్తిలోని ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించి తీవ్రంగా గాయపడిని ఇద్దరిని తిరుపతిలోని రుయా ఆసుపత్రికి తరలించారు.

ఎక్సైజ్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డిప్యూటీ కమిషనర్



రికార్డులు తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్

వాకాడు : మండల కేంద్రమైన వాకాడులోని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ స్టేషన్‌ని మంగళవారం చిత్తూరు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ విజయశేఖర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్టేషన్‌లోని రికార్డులు పరిశీలన చేశారు. అలాగే బెల్టుషాపులు, కల్తీకల్లు అమ్మకాలపై ప్రత్యేక నిఘా ఉంచి కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఆయన వెంట సీఐ ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.

రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించిన క్రీడాకారులతో కోచ్

పెళ్లకూరు : మండలంలోని రోసనూరు జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మంగళవారం జరిగిన జిల్లా స్థాయి రెజ్లింగ్ పోటీల్లో 48 మంది క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో పాల్గొనే అవకాశం దక్కించుకున్నారు. జిల్లా స్థాయిలో అండర్–17, అండర్–23 విభాగాల్లో జరిగిన ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు ఈనెల 16 నుంచి 18 వరకు చిత్తూరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని జిల్లా కార్యదర్శి ఉదయ్‌కుమార్ తెలిపారు. రెజ్లింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ట్రినిటీ హాస్పిటల్ చైర్మన్ నాగూరయ్య, కోచ్ లోకేష్ ప్రసాద్ పాల్గొన్నారు.

కనులపండువగా శ్రీవారి చక్రస్నానం

- ముగిసిన పెంచలకోన బ్రహ్మోత్సవాలు

రాపూరు: పెంచలకోనలో బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన మంగళవారం ఉదయం శ్రీవారి చక్రస్నానం కనులపండువగా జరిగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులు, సుదర్శన చక్రం విగ్రహాలను పల్లకిలో కొలువుదీర్చి పుష్కరిణి వద్దకు తీసుకొచ్చారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛరణాల మధ్య పుష్కరిణిలో స్వామివారి చక్రతల్వార్ (సుదర్శన చక్రం)ను పుష్కరిణిలో చక్రస్నానం చేయించారు.

వైభవంగా వసంతోత్సవాలు

పెంచలకోనలో స్వామి వారికి వసంతోత్సవాలు నిర్వహించారు. కల్యాణం అనంతరం స్వామి అమ్మవార్లకు వసంతాలు చల్లి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

తెప్పపై నరసింహుని విహారం

శోభాయమానంగా అలంకరించిన తెప్పపై పెనుశిల నరసింహస్వామి ఉభయనాంచారులతో కలసి కొలువుతీరి పుష్కరిణిలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. పెంచలకోనలోని నరసింహ స్వామి వారి ఆలయంలో ఆరు రోజులుగా జరుగుతున్న శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజు పెనుశిల లక్ష్మీనరసింహస్వామికి తెప్పోత్సవం నిర్వహించారు. రాత్రి 10 గంటలకు స్వామి వారిని అశ్వవాహనంపై ఉంచి కోన మాడ వీధుల్లో క్షేత్రోత్సవం నిర్వహించారు. రాత్రి 11 గంటలకు ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి.



పుష్కరిణిలో సుదర్శన చక్రానికి స్నానం చేయిస్తున్న అర్చకులు



తెప్పపై విహరిస్తున్న స్వామి అమ్మవార్లు (ఇన్‌సెట్)
తెప్పపై విశేషాలంకరణలో స్వామి అమ్మవార్లు

సిందూరంతో 'మురళీ' చిత్రం



వీరజవాన్ మురళీనాయక్ చిత్రపటాన్ని కలెక్టర్‌కు అందిస్తున్న ఆర్టిస్ట్ చిరంజీవి

తిరుపతి అర్బన్ : తిరుపతి కేంద్రంగా పనిచేస్తున్న మైక్రో ఆర్టిస్ట్ చిరంజీవి తాజాగా ఇటీవల యుద్ధంలో మృతి చెందిన వీరజవాన్ మురళీ నాయక్ చిత్రపటాన్ని శ్రీపద్మావతి అమ్మవారి సిందూరంతో తయారు చేసి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌కు సమర్పించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిశారు. దేశభక్తి సృజనాత్మకతను చాటుకునేలా వీరజవాన్ చిత్రపటాన్ని తయారు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆర్టిస్ట్ చిరంజీవిని అభినందించారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

గూడూరురూరల్ : గూడూరు పట్టణ శివారు ప్రాంతంలోని టిడ్కో ఇళ్లలో నివాసం ఉండే ఓ వ్యక్తి కుటుంబం కలహాల కారణంగా ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు టిడ్కో ఇళ్లలో నివాసం ఉండే కావలి సుబ్బారావు(43) నెల్లూరులోని విద్యుత్ శాఖ కార్యాలయంలో సబార్డినేటర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో అతడి కుటుంబంలో ఏర్పడిన కలహాల కారణంగా మనస్తాపం చెందిన ఆయన ఇంటిలో ఎవ్వరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు చూసేసరికి అప్పటికే మృతి చెందిన్నట్లు గుర్తించారు. దీంతో వారు రూరల్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఆత్మహత్యకు గల కారణాలను తెలుసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా

- ఒకరి మృతి.. ప్రాణాలతో బయటపడ్డ మరో ముగ్గురు



వేణు (ఫైల్)

శ్రీకాళహస్తి : ఈత సరదా ఓ యువకుడి నిండు ప్రాణాలను బలిగొనగా.. మరో ముగ్గురు యువకులు ప్రాణాలతో బయటపడిన సంఘటన మంగళవారం తొట్టంబేడు మండలంలోని ఇలగనూరు తెలుగు గంగ కాలువ వద్ద చోటు చేసుకుంది. వివరాలు ఇలా.. తొట్టంబేడు మండలం దైనేడు గ్రామానికి చెందిన రాగిపాటి వేణుమాధవ్ తండ్రి మరణించడంతో తల్లితో కలిసి నాయుడుపేట సమీపంలోని విన్నమాలలో అమ్మమ్మ వద్దే పదేళ్లుగా నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో తాగుడుకు బానిసైన వేణు మాధవ్(18) మంగళవారం స్నేహితులతో కలిసి ఏర్పేడు మండలంలోని మూలకండ్రిగకు బయలుదేరాడు. మార్గ మధ్యలో ఇలగనూరు వద్ద తెలుగు గంగ కాలువలో ఈత సరదా తీర్చుకునేందుకు స్నేహితులతో కలిసి దిగారు. ఈ క్రమంలో వేణుమాధవ్ నీటి ఉధృతికి కొట్టుకొని పోగా అతడి స్నేహితులు సుమన్, చందు, సుబ్బు ఎలాగోలా ప్రాణాలతో ఒడ్డుకు చేరుకున్నారు. నీటి ఉధృతికి కొట్టుకుపోయి ప్రాణాలు విడిచిన వేణుమాధవ్ మృతదేహాన్ని కొంతమంది జాలర్లు సమీపంలోనే ఒడ్డుకు చేర్చారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే మృతుడి బంధువులు వేణు మృతిపై అనుమానాలున్నాయంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వడదెబ్బతో ఉపాధి కూలీ మృతి

వాకాడు : మండలంలోని రావిగుంటపాళెం గ్రామానికి చెందిన పావలశెట్టి కలివేలమ్మ (52) ఉపాధి కూలీ వడదెబ్బతో మృతి చెందడంతో ఎంపీడీఓ శ్రీనివాసులు మంగళవారం ఆ కుటుంబాన్ని పరామర్శించారు. సోమవారం ఉపాధి పనులు చేస్తుండగా వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలోకి వెళ్లిందన్నారు. గమనించిన తోటి కూలీలు ఆమెను ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందిందన్నారు.

భూములను సారవంతం చేద్దాం

- విత్తనాల కిట్ ప్రయోజనాలను తెలియజేయండి
- వ్యవసాయాధికారులతో కలెక్టర్ సమీక్ష



వ్యవసాయశాఖ అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్ : రసాయనిక ఎరువుల వాడకంతో భూములు నిస్సారంగా తయారు అవుతున్న నేపథ్యంలో పొలాలు సారవంతం చేయడానికి రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో అగ్రికల్చర్ అధికారులతో సమీక్షించారు. 30 రకాల పంట విత్తనాలతో కొత్తగా మార్కెట్‌లోకి వస్తున్న కిట్స్‌ను పంటలు సాగు చేయడానికి 50 రోజుల ముందు చల్లాల్సిన అవసరాన్ని రైతులకు తెలియజేయాలని చెప్పారు. ప్రధానంగా జీలుగ, జనుము , పిల్లిపెసర, మొక్కజొన్న, సజ్జలు, రాగులు, జొన్నలు, అనప గింజలు, పెసలు, కందులు, కొర్రలు, అండుకొర్రలు, ఉదలు, అరికలు, సాములు తదితర 30 రకాల పంట విత్తనాల కిట్స్‌ను తెప్పించాలని కోరారు. ఇప్పటికే పొదుపు సంఘం సభ్యులు ఇలాంటి కిట్స్‌ను తయారు చేస్తున్నారని పేర్కొన్నారు. జిల్లాలోని 774 పంచాయతీల్లో ఒక్కో పంచాయితీకి 25కి పైగా కిట్స్ విక్రయించేలా కృషి చేయాలన్నారు. 50 వేల కిట్స్‌ను రానున్న ఖరీఫ్ సీజన్‌కు సిద్ధం చేసుకోవాలని తెలియజేశారు. ఒక్కో కిట్ రూ.1000 చొప్పున రైతులకు విక్రయించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని వివరించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయశాఖ అధికారి ప్రసాద్‌రావు, ఉద్యానశాఖ అధికారి దశరథరామిరెడ్డి, ప్రకృతి వ్యవసాయ జిల్లా అధికారి షణ్ముగం కిట్స్‌తో కలిగే ప్రయోజనాలను వివరించారు.